క్లుప్తంగా

ఘనంగా మహాకవి ఆరుద్ర జయంతి



చిలకలూరిపేటటౌన్: పట్టణంలో ఆదివారం మహాకవి ఆరుద్ర శత జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక, షేక్ లాలూ దాదాసాహెబ్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు హాజరై, ఆరుద్ర జీవితం, రచనల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరుద్ర రాసిన పాటలను పాడి వినిపించారు. ఈ సందర్భంగా హాస్టల్ గ్రంథాలయానికి రూ.వెయ్యి విలువైన 25 రకాల బాలసాహిత్య పుస్తకాలను బహుమతిగా అందజేశారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దార్ల బుజ్జిబాబు, లాలూ దాదా సాహెబ్ సేవా సమితి అధ్యక్షులు షేక్ కరిముల్లా, వైఎంసీఏ అధ్యక్షుడు చుక్క విన్సెంట్‌పాల్, హాస్టల్ వార్డెన్ అంకమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు పంపిణీ



నరసరావుపేట ఈస్ట్: పేద ఆర్యవైశ్య విద్యార్థులకు పెనుగొండ వెంకటేశ్వరరావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.1.53 లక్షల ఉపకార వేతనాలను అందచేశారు. శ్రీసీతారామస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 51మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున పంపిణీ చేసారు.ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, పూరా భాస్కరరావు, వనమా సాంబశివరావు, వాసిరెడ్డి రవి, మండవ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. గత 15 సంవత్సరాలుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయటం పట్ల ట్రస్ట్ నిర్వాహకులు పెనుగొండ ప్రభాకర్, పెనుగొండ ప్రతాప్‌లను అభినందించారు.

కమలారామ్‌కు తెలుగు తేజం అవార్డు



వినుకొండ: పట్టణానికి చెందిన కవి కమలారామ్‌కు తెలుగుతేజం అవార్డు దక్కింది. నరసరావుపేటలో ఆదివారం జరిగిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి ఉత్సవాల్లో అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన తెలుగు తేజం పురస్కారాన్ని కవి కమలారామ్‌కు అందజేసి ఘనంగా సన్మానించారు. అవార్డు అందుకున్న కమలారామ్‌ను పలువురు అభినందించారు.

గంగమ్మతల్లి చెరువుకు బహిరంగ వేలం

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లు పంచాయతీ పరిధిలోని గంగమ్మతల్లి చెరువులో చేపలు పట్టుకునేందుకు ఈ నెల 4వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ రమీజ్, సర్పంచ్ సీహెచ్ జయశ్రీలు ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందని, పంచాయితీరాజ్ నిర్దేశించిన షరతులకు వేలం జరుగుతుందన్నారు. తుది నిర్ణయం పంచాయతీ కార్యదర్శిదేనని చెప్పారు.

గుంటూరు జిల్లా ఆవోపాలో సత్తెనపల్లి వాసులకు చోటు

సత్తెనపల్లి: ఆర్యవైశ్య ఆఫీషియల్స్, ప్రొఫెషనల్స్(ఆవోపా) అసోసియేషన్ గుంటూరు జిల్లాలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి వాసులు ముగ్గురికి చోటు లభించింది. ఆదివారం గుంటూరు అరండల్ పేట 7వ లైనులో ఉన్న గుంటూరు ఆవోపా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చింతా కృష్ణారావు చేతుల మీదుగా వారు నియామక పత్రం అందుకున్నారు. వారిలో సత్తెనపల్లి పట్టణానికి చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ యక్కల సుధాకరరావును జిల్లా ఉపాధ్యక్షుడిగా, న్యాయవాదులు చలువాది చిన సత్యనారాయణ, దివ్వెల శ్రీనివాసరావు జిల్లా కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. వీరి పదవీకాలం రెండు సంవత్సరాల పాటు ఉంటుంది. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు తడవర్తి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యవర్గ బాధ్యులు, వివిధ పట్టణాల్లో ఉన్న ఆవోపా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పట్టణం.. సమస్యల నిలయం

- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి
- 25, 26 వార్డుల్లో 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట'
- సమస్యలు ఏకరవు పెట్టిన స్థానికులు



రాజీవ్ గృహకల్ప సముదాయంలో ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలను పరిశీలిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



రామిరెడ్డిపేట రెండోలైనులో తన ఇంటిముందు డ్రెయిన్ పరిస్థితిని వివరిస్తున్న స్థానికురాలు

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఎక్కడ చూసినా తాగి పడేసిన ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయని, స్టేషన్ రోడ్డు మొత్తం ఖాళీ మద్యం సీసాలతో నిండిపోయిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నాయకులు, కార్యకర్తలతో కలిసి గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమం సందర్భంగా స్టేషన్‌రోడ్డు, రామిరెడ్డిపేట రెండు, మూడోలైను, శృంగేరి శంకర మఠం లైను,పెద్ద చెరువులోని 25.26 వార్డుల్లో పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి గాడి తప్పిన పారిశుద్ధ్యంపై, కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రస్థాయిలో ఎండగట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రామిరెడ్డిపేట రెండోలైన్‌లో సన్నిధి ఫంక్షన్ హాల్ వెనుకవైపు ఇళ్లముందున్న సైడు కాలువలు పొంగిపొర్లుతున్నాయని, ఫిర్యాదుచేసినా సుమారు రెండు నెలల నుంచి ఎవరూ పట్టించుకోవట్లేదని ఢిల్లీ ఎయిమ్స్‌లో పనిచేసి వచ్చిన ఒక రిటైర్డ్ ఉద్యోగస్తురాలు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాల పక్కగా స్మశాన వాటిక సమీపంలో తాగునీటిపైపుకు లీకు ఏర్పడి నీరు వృధాగా పోతున్న పట్టించుకున్న వారెవరూ లేరన్నారు.

■ స్థానిక పెద్దచెరువులోని రాజీవ్‌గృహకల్ప సముదాయంలో ప్రజలు మంచినీళ్లకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పట్టణం నడిబొడ్డున ఉన్న ప్రాంతంలోనే మంచినీరు మున్సిపల్ అధికారులు అందించలేకపోతే, పట్టణమంతా ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. రాజీవ్ గృహకల్ప సదుపాయాలలో నివాసం ఉంటున్న ప్రతి ప్లాట్ యజమానుల నుంచి నీటికోసం మాజీ తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ కుమారుడు నెలకు రూ.200లు వసూలు చేస్తున్నాడని, ప్రతిరోజూ మోటార్ వేయకుండా కేవలం నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే వేస్తున్నాడన్నారు. అదేమని అడిగితే దుర్భాషలాడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎన్ఎస్పీ కెనాల్స్ ముళ్ళ కంపలు తొలగించడం జరిగిందని, అయితే గ్రావెల్ ఫిల్లింగ్ చేయటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. రైతులు పొలాలకి వెళ్లి సాగుపనులు చేసుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి తక్షణమే గ్రావెల్ ఫిల్లింగ్ పనులు పూర్తి చేయాలని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకుడు షేక్ ఖాజావలి మాష్టారు, జిల్లా కార్యదర్శి ఎస్.సుజాతాపాల్, పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, వర్కింగ్ అధ్యక్షుడు అచ్చిశివకోటి, మైనార్టీసెల్ పట్టణ అధ్యక్షులు షేక్ శిలార్‌బాష, మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, సోషల్‌మీడియా నియోజకవర్గ కన్వీనర్ బూదాల కల్యాణ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు మద్రిపూడి రాంబాబు, సుబ్రమణ్యం నాయి, గంటినపాటి గాబ్రియేలు, తదితర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

నాదెండ్ల: గొర్రెల మందలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో గొర్రెల కాపరి మృతి చెందాడు. ఎస్ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం రాత్రి నూతన బైపాస్ రోడ్డుపై కావూరు అండర్ పాస్ వద్ద సర్వీసు రోడ్డులో వేగంగా వెళ్తున్న కారు గొర్రెలమందపైకి దూసుకెళ్ళింది. ఈ ఘటనలో గొర్రెల కాపరి ఆవుల శ్రీనివాసరావు (45) తీవ్ర గాయాల పాలవటంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన ఏపీ39హెచ్ ఈ4237 నంబరు గల కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట రాయుళ్లు అరెస్టు



యడ్లపాడు: పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. మండలంలోని వంకాయలపాడు గ్రామంలో అక్రమంగా కోత ముక్కల పందేలు ఆడుతున్నారంటూ విశ్వసనీయమైన సమాచారం అందడంతో ఎస్ఐ టి.శివరామకృష్ణ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై మెరుపుదాడి చేశారు. ఈ దాడిలో కోత ముక్కలు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.14,700 నగదును స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

నిమజ్జనాల సందడి



పెట్లూరివారిపాలెంలో జరిగిన నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



సాతులూరులో భరతనాట్యంలో బహుమతులు గెలుచుకున్న చిన్నారులు



చిలకలూరిపేటలో నిమజ్జనానికి తరలివెళ్తున్న మట్టి వినాయక విగ్రహం

గణనాథుల నిమజ్జన ఊరేగింపులతో ఊరు, వాడా సందడి నెలకొంది. వీధివీధిన ఏర్పాటు చేసిన మండపాల్లో ఐదు రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. గణపతి లడ్డూని దక్కించుకునేందుకు భక్తులు వేలంలో పోటీ పడ్డారు. సాతులూరులోని గణపతి విగ్రహం వద్ద భరతనాట్యం పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. నరసరావుపేట రూరల్ మండలం పెట్లూరివారిపాలెంలో జరిగిన నిమజ్జన ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

– నరసరావుపేట రూరల్, నాదెండ్ల, చిలకలూరిపేట

వైభవంగా రాధాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో శ్రీరాధ గోవిందులు

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరాధ గోవింద చంద్ర మందిరం ఇస్కాన్ ఆలయంలో ఆదివారం శ్రీరాధాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూలమూర్తులకు మంగళ హారతితో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు చేసారు. శ్రీరాధాదేవి పాద దర్శనాన్ని భక్తులకు కల్పించారు. అలాగే ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులకు మహా శంఖాభిషేకం నిర్వహించి మహారాజభోగ నివేదన సమర్పించి రాజభోగ హారతి అనంతరం భక్తులకు మహా ప్రసాదాన్ని అందచేసారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సుగాలి ప్రీతి కేసులో న్యాయపోరాటానికి అండగా ఉంటాం

కాపు యువజన అధ్యక్షుడు కర్జా శ్రీనివాసరావు

శావల్యాపురం: సుగాలి ప్రీతి కేసుపై తల్లి చేసే న్యాయ పోరాటానికి తాము అండగా ఉంటామని కాపు యువజన అధ్యక్షుడు కర్జా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఎన్నికల సమయంలో జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదల పవన్‌కళ్యాణ్ తాము అధికారంలోకా రాగానే సుగాలి ప్రీతి కేసులో నిందితులను పట్టుకొని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మోసపూరిత మాటలు చెప్పటం మినహా చేసిందేమి లేదన్నారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా నేటివరకు కేసు చేధించకపోవటం, ఆ కుటుంబానికి న్యాయం చేయకపోవటం కూటమి ప్రభుత్వ తీరుకు నిదర్శమని ఎద్దేవా చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో బాధిత కుటుంబానికి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉండి ఆర్థిక చేయూత, ఉద్యోగ భద్రత కల్పించి భరోసా ఇచ్చారన్నారు. ప్రీతి కేసును పక్కదోవ పట్టించేందుకే డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రుషికొండ భవనాలపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సుగాలి ప్రీతి హత్య కేసులో నిందితులను పట్టుకొని, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఏరువాక సాగాలో..



వరి నాట్లు వేసేందుకు ట్రాక్టరుతో దుక్కిచేస్తున్న రైతు

గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వాతావరణం అనుకూలించి ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవటంతో జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. రైతులు వరినారు మదులను సిద్ధం చేస్తూ వ్యవసాయ పనుల్లో తలమునకలవుతున్నారు. వాగులు, కుంటలు, బావుల సమీపంలోని పొలాల్లో వరినాట్లు తుదిదశకు చేరుకున్నాయి.

– శావల్యాపురం



శావల్యాపురంలో వరి నారుమదులు సిద్ధం

సమాజ నిర్దేశకులు గురువులు



కోదండ రామాచార్యులును సత్కరించి మెమెంటో అందిస్తున్న విఖనస మండలి బాధ్యులు

సత్తెనపల్లి: సమాజ నిర్దేశకులు గురువులేనని విఖనస మండలి ఉపాధ్యక్షుడు గుడిపూడి తులసికృష్ణ భట్ట అన్నారు. నరసరావుపేటలోని మున్సిపల్ బాలుర పాఠశాలలో ఆర్ట్స్ ఉపాధ్యాయుడిగా గత 35 సంవత్సరాలుగా పనిచేస్తూ ఆదివారం పదవీ విరమణ పొందిన వేదాంతం కోదండ రామాచార్యులు (రాంబాబు) సన్మాన మహోత్సవంలో భాగంగా సత్కరించి మెమెంటో అందించారు. ఈ సందర్భంగా తులసికృష్ణ భట్ట మాట్లాడుతూ ఉపాధ్యాయులు రోజులో మూడో వంతు సమయాన్ని విద్యార్థులతో గడుపుతారని, ఆ సమయంలో వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తారన్నారు. బోధనలో మంచి నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులను విద్యార్థులు ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటారన్నారు. ఈ సందర్భంగా వేదాంతం కోదండ రామాచార్యులు సేవలను పలువురు కొనియాడారు. అనంతరం ఆయనను సత్కరించి మెమెంటో అందించారు. కార్యక్రమంలో విఖనస మండలి బాధ్యులు నల్లూరి శ్రీనివాస్, నారాయణ లక్ష్మీనారాయణ, పుసులూరి సంపత్‌కుమార్, పెద్దింటి ఫణికృష్ణ, వేదాంతం రామకృష్ణమాచార్యులు, వేదాంతం శ్రీనివాస్, వేదాంతం భార్గవనాథ్, వేదాంతం విజయ నసింహాచార్యులు, వేదాంతం కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

15 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

సత్తెనపల్లి: పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు పట్టణ పోలీసులు పట్టణంలోని మన్యం రెసిడెన్సీ లాడ్జిలో శనివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. లాడ్జిలోని రూమ్ నెంబర్ 307లో పేకాట ఆడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,45,670 నగదు, 21 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పట్టణ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతోపాటు ఎస్ఐలు పవన్ కుమార్, శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

అచ్చంపేట: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక, పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీల ఆధ్వర్యంలో అచ్చంపేటలో భగవద్గీత ప్రాముఖ్యతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇందూ ధర్మ భగవద్గీత గ్రంథాలను ఇంటింటా పంపిణీ చేశారు. స్థానిక విద్యాన్ హైస్కూలులో కమిటీ సభ్యులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో చర్చ నిర్వహించారు. భూమి మీద అవతరించిన మహోన్నత వ్యక్తే శ్రీకృష్ణ భగవానుడని చెప్పారు. పూర్వం కృష్ణాష్టమి వేడుకలను 11 రోజులపాటు నిర్వహించి వినాయక చవితి రోజు ముగించేవారని చెప్పారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీల అధ్యక్షులు కటకం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, సభ్యులు కె.అరుణ, కె.కార్తీక్, నారాయణమ్మ, అనూరాధ, వెంకటలక్ష్మి, శ్రీని, వీరయ్య, రాఘవ, సుందరం, రామాంజనేయులు, గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరనాయక్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సహాయం

నకరికల్లు: సేవా కార్యక్రమాలలో పేదలను ఆదుకుంటామని గుండ్లపల్లి ఎంప్లాయీస్ హెల్పింగ్ హ్యాండ్స్ సంఘం సభ్యులు తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్‌రఫీ పిడుగురాళ్ల సున్నం మిల్లులో రాళ్లు కొట్టేపని చేస్తుండగా కంటికి తీవ్ర గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విషయం తెలుసుకున్న గుండ్లపల్లి ఎంప్లాయీస్ హెల్పింగ్ హ్యాండ్స్ మానవత్వంతో ఆ కుటుంబానికి సహాయంగా నగదు, బియ్యం, కిరాణా సరుకులు అందించారు. కార్యక్రమంలో గుండ్లపల్లి ఎంప్లాయీస్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గుండు మస్తాన్‌వలి, గుత్తికొండ మహబూబ సుభాని, జమాల్ అల్లాభక్షు, కరాలపాటి సైదావలి తదితరులు పాల్గొన్నారు.

జ్వర పీడితులకు హోమియో మందులు పంపిణీ



అచ్చంపేట: స్థానిక వీరభద్రస్వామి కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు జ్వర పీడితులకు, వ్యాధులకు గురికాకుండా ముందస్తు చర్యలలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం హోమియో మందులు పంపిణీ చేశారు. కాలనీలో దోమల దాడి ఎక్కువగా ఉన్నందున చికెన్‌గున్యా, డెంగీ వంటి వ్యాధులకు గురికాకుండా ముందస్తుగా హోమియో మందుల పంపిణీ చేస్తున్నట్లు సీపీఎం మండల నాయకులు హనుమంతరావు తెలిపారు. తామిచ్చే హోమియో పిల్స్ వారానికి రెండు చొప్పున వాడినట్లయితే విషజ్వరాల నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ఆర్ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మస్తాన్ బుజ్జి సంపంగి ఏడుకొండలు, మీరసాబుడే తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సేవలందించటంలోనే ఆనందం



అమరావతి: రైతలకు నిరంతరం సేవలందించటంలోనే తాను ఆనందం పొందానని మునగోడు ప్రాథమిక వ్యవసాయ సహకారం పరపతి సంఘం లిమిటెడ్ సీఈవోగా ఉద్యోగ విరమణ చేసిన సాంబశివరావు అన్నారు. ఆదివారం సొసైటీ ఆవరణలో నిర్వహించిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ సుమారు 39 సంవత్సరాలపాటు మునగోడు సొసైటీలో రైతులకు సేవలందించానన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే మునగోడు సొసైటీ మొదటి స్థానంలో నిలవటం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఈ సందర్భంగా మునగోడు సొసైటీ చైర్‌పర్సన్ నాగోతు నాగార్జున, జీడీసీసీ బ్యాంకు విశ్రాంత మేనేజర్ పి.శివన్నారాయణ పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు సాంబశివరావు, చంద్రకళ దంపతులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి ఆయన సేవలు మరువలేమని శేష జీవితాన్ని సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు.